ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 27.5
కనిష్ఠం 21.4

ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి

ఆదివారం 21 జూలై 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.60 (122.6854)	నిల్	9,874
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	639.50 (2.98)	1,550.29	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	100.98 (0.81)	929	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.142 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250



తిరుమలగిరిలో పత్తిచేనులో నిలిచిన వర్షపు నీరు

ముసురుపట్టింది

ఉమ్మడి జిల్లాలో రోజంతా వాన

నల్లగొండ, సూర్యాపేటటౌన్, మోత్కూరు, రాజాపేట, మోటకొండూరు, భువనగిరి టౌన్, తిరుమలగిరి, మద్దిరాల, అర్వపల్లి, చివ్వెంల, చిలుకూరు, నాగారం, దేవరకొండ, శాలిగౌరారం, కేతేపల్లి, చండూరు, జూలై 20: ఉమ్మడి జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం రోజంతా ముసురుతో కూడిన వర్షం కురుస్తూనే ఉంది. నల్లగొండ జిల్లాలో అత్యధికంగా వేములపల్లి మండలంలో 31.5మి.మీలు, దామరచర్లలో 30.2 మి.మీలు, నల్లగొండ 29.9మి.మీలు,అత్యల్పంగా త్రిపురారం మండలంలో 20.2మి.మీల వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 14.8మి.మీల సగటున వర్షపాతం నమోదైంది. యాదాద్రి జిల్లాలో 9.8మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా యాదగిరిగుట్ట మండలంలో 14.3 మి.మీ, అత్యల్పంగా సంస్థాన్‌నారాయణపురం మండలంలో 3.00మి.మీ వర్షపాతం నమోదైంది. సూర్యాపేట జిల్లాలో అత్యధికంగా మేళ్లచెర్వులో 46.8మి.మీ, అత్యల్పంగా తుంగతుర్తిలో 11.1మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో 23.6 మి.మీ సరాసరి వర్షపాతం నమోదైంది. ఈ వర్షాలతో పత్తి చేలకు ప్రయోజనం చేకూరనుంది. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 5.40లక్షల ఎకరాలకు పత్తి 3,46,790 ఎకరాల్లో సాగైంది. ప్రస్తుత వర్షాలతో నెలాఖరు వరకు పత్తి విత్తనాలు విత్తే అవకాశం ఉంది.

● యాదాద్రి జిల్లా మోత్కూరు మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం రోజంతా చిరుజల్లులు కురిశాయి. మండలంలో 4.8మి.మీ వర్షపాతం నమోదైంది. రోజంతా ముసురు పట్టడంతో వ్యవసాయ పనులు సాగలేదు. రాజాపేట మండలంలో ఈదురు గాలులతో కూడిన చిరు జల్లులు కురిశాయి. మోటకొండూరు, వలిగొండ మండలాల వ్యాప్తంగా ముసురుపట్టింది. వలిగొండ మండలంలో 12.8మి.మీ వర్షంపాతం నమోదైంది. మూసీ నదీలోకి భారీగా వరద వస్తోంది. ముసురు వర్షాల నేపథ్యంలో భువనగిరి మునిసిపాలిటీలో ఎమర్జెన్సీ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. వర్షం కారణంగా చెట్లు కూలినా, విద్యుత్ స్తంభాలు పడిపోయినా, వరదతో రహదారులు స్తంభించినా, లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరినా కంట్రోల్ రూం నెంబర్లు 9849907768, 9951365746కు ఫోన్ చేయాలని మునిసిపల్ కమిషనర్ పి.రామాంజల్‌రెడ్డి కోరారు.



శాలిగౌరారంలో నీట మునిగిన పంట పొలాలు

● సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో మండలంలో ముసురుతో కూడిన వర్షం కురిసింది. అర్వపల్లి మండల వ్యాప్తంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి. బతుకమ్మ కుంట నిండి అలుగు పోస్తోంది. రామన్నగూడెం, పర్సాయపల్లి గ్రామాల్లోని చెరువుల్లోకి వర్షపు నీరు చేరింది. వర్షాలకు జాజిరెడ్డిగూడెం జడ్పీ ఉన్నతపాఠశాలలో తరగతి గదుల స్లాబ్ పెచ్చులూడి ప్రమాదకరంగా ఉంది. చివ్వెంల మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఎడతెరిపి లేని వర్షం కురుస్తూనే ఉంది. ముసురు కారణంగా అవసరమైతే తప్ప బయటికి రావద్దని చిలుకూరు తహసీల్దార్ ధృవకుమార్, మద్దిరాల ఎస్ఐ మధునాయుడు కోరారు. నాగారం మండలంలో వర్షాల కారణంగా మెట్ట పంటలు దెబ్బతిన్నాయి. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరద నిల్వ ఉండకుండా అధికారులు దృష్టి సారించాలని మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని 19వార్డులో పర్యటించి శివారు, ముంపు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలోని 7, 14వార్డుల్లో వరద ప్రవహించేలా అధికారులు డోజర్ సహాయంతో రెంచ్ కొట్టారు.

● దేవరకొండ మండలంలో ముసురుతో కూడిన వర్షం కురుస్తోంది. శాలిగౌరారం మండలంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగాయి. మూసీ నది పల్లివాడ ఆనకట్ట నుంచి శాలిగౌరారం ప్రాజెక్టులోకి భారీగా వరద వస్తోంది. చండూరు పట్టణానికి చెందిన చేనేత కార్మికుడు రుద్ర శేఖర్ ఇల్లు కూలింది.

మూసీకి పెరిగిన వరద తాకిడి

504.60 అడుగుల వద్ద సాగర్ నీటి మట్టం

కేతేపల్లి, జూలై 20: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద తాకిడి పెరిగింది. నాలుగు రోజులుగా నిలకడగా ఉన్న ఇన్‌ఫ్లో శనివారం రెట్టింపైంది. మూసీ ఎగువ పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకుతోడు మూసీ పరివాహక గ్రామాల చెరువులు, కుంటలు నిండడంతో వరద దిగువన ఉన్న మూసీ ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది. ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వచ్చే ఇన్‌ఫ్లో శుక్రవారం సాయంత్రం 560క్యూసెక్కులు ఉండగా, అది శనివారం సాయంత్రానికి 1,550క్యూసెక్కులుగా నమోదైంది. 645అడుగులు (4.46టీఎంసీ) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం ఉన్న మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 639.20అడుగులు (2.98టీఎంసీ)లుగా ఉంది. ఇదిలా ఉండగా, మూసీ ప్రాజెక్టును సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ శనివారం మధ్యాహ్నం సందర్శించారు. నీటి నిల్వ, ఇన్‌ఫ్లో వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో డ్యాం అధికారులు పరిస్థితిని గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట మూసీ ప్రాజెక్టు డీఈఈ చంద్రశేఖర్, సూర్యాపేట తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి ఉన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

సూర్యాపేట(కలెక్టరేట్): వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. శనివారం వెబెక్స్ ద్వారా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. అధికారులు వారు విధులు నిర్వహించే ప్రాంతాల్లో అందుబాటులో ఉండాలన్నారు. పురాతన ఇళ్లను గుర్తించి నివాసం ఉంటున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. నీటి ప్రవాహాలు ఉన్న చోట ఎర్రజెండాలు, డేంజర్ బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అత్యవసర సేవలకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం నెంబర్ 6281492368 ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఒక ప్రకటనలో కోరారు. వరద ప్రవాహాల వద్దకు వెళ్లి సెల్ఫీలు దిగే ప్రయత్నం చేయవద్దన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 100కు డయల్ చేయాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని, వాతావరణం తడిగా ఉన్నందున కరెంట్ స్తంభాల వద్దకు ప్రజలు వెళ్లవద్దన్నారు.



మూసీ డ్యాంపై అధికారులతో పరిస్థితిని సమీక్షిస్తున్న సూర్యాపేట జిల్లా కలెక్టర్



రైతు బీమాకు వేళాయె

» 30 వరకు రెన్యూవల్ ప్రక్రియ
» ఐదెకరాలలోపు ఉన్నరైతులతో కచ్చితంగా దరఖాస్తు చేయించేలా నిర్ణయం

నల్లగొండ, జూలై 20: రాష్ట్రంలో గత ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు బీమా పథకాన్ని కొనసాగించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా రైతు బీమాకు ప్రీమియం చెల్లింపునకు నిధులు కేటాయించడంతో పాటు ఉత్తర్వులు జారీ చేసింది. దురదృష్టవశాత్తు ఇంటి పెద్ద అయిన రైతు మృతిచెందితే అతడి కుటుంబం వీధిన పడకుండా ఉండేలా రైతు బీమాను గత ప్రభుత్వం తీసుకువచ్చింది. 18 నుంచి 59 ఏళ్ల వయసున్న ప్రతీ రైతుకు ఈ బీమా వర్తిస్తుంది. రైతు మృతిచెందితే ఆ కుటుంబానికి 10 రోజుల్లోనే బీమాసొమ్ము రూ.5లక్షలు ఆ రైతు కుటుంబం ఖాతాలో జమవుతాయి. ప్రభుత్వమే రైతుకు ఎలాంటి ఖర్చులేకుండా ప్రీమియం చెల్లిస్తోంది. నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదటిసారిగా రైతు బీమా ప్రీమియం చెల్లింపునకు ఏర్పాట్లు చేసింది.

కొత్త పాస్‌పుస్తకదారులకు అవకాశం

ఈ ఏడాది భూముల క్రయ, విక్రయాల ద్వారా కొత్తగా జారీ అయిన పాస్‌పుస్తకాలకు సంబంధించిన రైతులకు కూడా రైతు బీమాకు ప్రభుత్వం దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా సుమారు 65వేల కొత్త పాస్‌పుస్తకాలు రైతులకు అందాయి. ఒక్క నల్లగొండ జిల్లాలోనే 23వేలకు పైగా కొత్త పాస్‌పుస్తకాలు జారీ అయ్యాయి. వీరంతా వచ్చే నెల 5వ తేదీ వరకు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి. రెన్యూవల్ ఆటోమెటిక్‌గా రాష్ట్ర ప్రభుత్వమే గతంలో ఉన్న డేటా ప్రకారం చేస్తుంది. కొత్త పాస్‌పుస్తకదారులు మాత్రం వ్యవసాయశాఖ కార్యాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. పొరపాట్లు చేయకుండా నామినీ పేర్లను నమోదు చేయాలి. బీమా రెన్యూవల్ ఈనెల 30వ తేదీ వరకు ప్రభుత్వం పూర్తిచేయనుంది. అందులో నామినీ పేరును సరి చేసుకునేందుకు రైతులకు అవకాశాన్ని కల్పించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 10.50 లక్షల మంది రైతుల పేర్లు రైతు బీమాలో నమోదయ్యాయి. వీరందరికీ బీమా రెన్యూవల్ అవుతుంది.

రైతు బీమాపై మార్గదర్శకాలు వచ్చాయి




రాష్ట్ర ప్రభుత్వం రైతు బీమాకు సంబంధించి విధివిధానాలు వెల్లడించింది. ప్రభుత్వ ఆదేశం మేరకు రైతు బీమా పథకాన్ని ప్రతీ రైతుకు వర్తింపజేస్తాం. కొత్తగా పాస్‌పుస్తకాలు అందిన రైతులు నల్లగొండ జిల్లాలో 23వేల మందికి పైగా ఉన్నారు. వారు వచ్చే నెల 5వ తేదీలోగా రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి. రెన్యూవల్స్‌కు సంబంధించి ఎవరైనా రైతులు నామినీ పేరును మార్చుకొనే అవకాశం ఉంటుంది.

– పి.శ్రవణ్‌కుమార్, నల్లగొండ జేడీఏ

5ఎకరాలలోపు రైతుల గుర్తింపు

కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సారి కొత్తగా బీమా చేసుకొనే రైతుల కోసం నూతన ఆలోచనకు శ్రీకారం చుట్టింది. ఐదు ఎకరాలలోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులను కచ్చితంగా గుర్తించి వారి ద్వారా వచ్చే నెల 5లోగా దరఖాస్తులు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.స్థానికంగా లేకున్నా, వలస వెళ్లినా, వారిని గుర్తించి దరఖాస్తు చేయించనున్నారు. ఐదు ఎకరాలు పైబడి ఉన్న రైతులకు కూడా రైతుబీమా వర్తించనుంది. చిన్న, సన్నకారు రైతు మృతిచెందితే ఆ కుటుంబం నష్టపోకుండా ఉండేలా ప్రభుత్వం వారికి ప్రాధాన్యం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో సాంకేతిక సమస్యల కారణంగా రైతుబీమాకు నగదు రూ.5లక్షలు అందక పోవడంతో పలు కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయి. గతంలో జరిగిన పొరపాట్లు మళ్లీ తలెత్తకుండా నామినీ సమస్య రాకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

వర్షాలతో అంటువ్యాధుల ముప్పు



» విజృంభిస్తున్న దోమలు
» జిల్లాలో ఆరు డెంగీ కేసులు
» అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న వైద్యులు

జిల్లావ్యాప్తంగా ముసురుపట్టి వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గుంతల్లోకి నీరు చేరుతోంది. మురుగు కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయి వ్యర్థాలు రోడ్డు పైకి చేరుతున్నాయి. ఫలితంగా పరిసర ప్రాంతాలు కలుషితమై దోమలు విజృంభిస్తున్నాయి. దీనికి తోడు వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి.

– (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

వానాకాలంలో ప్రధానంగా డెంగీ, మలేరియా, విషజ్వరాలతో పాటు అతిసార అధికంగా ప్రజలుతుంటాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో విషజ్వరాలు, డెంగీ, మలేరియాతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యాదాద్రిజిల్లాలో ఇప్పటివరకు ఆరుడెంగీ కేసులు అధికారికంగా నమోదయ్యాయి. పలు కేసులు హైదరాబాద్ ఆస్పత్రుల్లో నమోదవుతున్నాయి. జిల్లాలో మొత్తం 21 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఒక జిల్లా ఆస్పత్రి, మూడు సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి.వర్షాకాలంలో అంటువ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలని సూచిస్తున్నారు. కాచి వడగట్టిన నీటిని తాగాలని, మంచినీటితో ఆహారం వండటం శ్రేయస్కరమని వైద్యులు పేర్కొంటున్నారు.

వ్యాధులు ఇలా..

మలేరియా 'అనాఫిలిస్' ఆడదోమ ద్వారా వస్తుంది. ఈ జ్వరం వచ్చిందంటే వారం, పది రోజులు మంచం పట్టాల్సిందే. జ్వరం వచ్చి తగ్గుతుండడం, చలి, శరీరంలో నొప్పులు, తలనొప్పి లాంటి లక్షణాలతో ప్రారంభమవుతుంది. ● కలుషిత నీరు, పానీయాలు, ఆహారపదార్థాలు తీసుకుంటే టైఫాయిడ్ వచ్చే ప్రమాదముంది. ఎక్కువ జ్వరం కడుపులో నొప్పి, వాంతులు ఈ జ్వరం లక్షణాలు. ● పగటి పూట కుట్టే దోమతో డెంగీ విజృంభిస్తుంది. సూర్యోదయం నాటి నుంచి అస్తమయం వరకు ఈ అర్బన్ మస్కిటో దాడి చేస్తుంది. ఎయిర్ కూలర్ల ఉండే నీటిలో, ఫ్లవర్ వాజులు, ఆక్వేరియం, నిలిచిన నీరు, నీటి మడుగులు, ట్యూబ్, టైర్లు, మూతలులేని ట్యాంకుల్లో ఈ దోమ స్థావరం ఏర్పాటుచేసుకుంటుంది. ● లైబ్రియో కలరే అనే బ్యాక్టీరియా ద్వారా కలరా వ్యాపిస్తుంది. ఈ బ్యాక్టీరియా ఉన్న ఆహార పదార్థాలు, నీళ్ల తాగినా కలరా వచ్చే ప్రమాదముంది. ● కలుషిత నీటితో కూరలు, పళ్ల కడిగినా కలరా వచ్చే ప్రమాదముంది.

క్షేత్రస్థాయిలో అధికారుల పర్యటనలు

భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించింది. దీంతో పీహెచ్‌సీ వైద్యులు, ఆశావర్కర్లు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాలు జారీ చేసింది. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జిల్లా, గ్రామస్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటుచేసేందుకు యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. జిల్లాస్థాయి కమిటీలో డీఎంహెచ్‌వో, జడ్పీ సీఈవో, డీపీవో, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి ఉంటారు. గ్రామస్థాయి కమిటీల్లో ఆశావర్కర్, అంగన్‌వాడీ కార్యకర్త, పంచాయతీ కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. అంటువ్యాధులు ప్రబలిన కాలనీలను వీరు గుర్తించి పీహెచ్‌సీలకు సమాచారం ఇచ్చి అవసరమైన ప్రాథమిక చికిత్స చేస్తారు. వ్యాధుల నివారణను జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ పర్యవేక్షిస్తుంది. అంటువ్యాధుల నివారణకు జిల్లాలో ప్రత్యేక సెల్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఇప్పటికే కలెక్టర్ హనుమంత్ కే.జెండగే పాఠశాలలు, కాలనీల్లో పర్యటించి పరిశుభ్రతను పరిశీలించారు. పీహెచ్‌సీలను తనిఖీచేసి వైద్యులను అప్రమత్తం చేస్తున్నామని డీఎంహెచ్‌వో పాపారావు తెలిపారు.

కాలానికి అనుగుణంగా చేనేత వస్త్రాలు

» ప్రముఖ యాంకర్ సుమ కనకాల » హైటెక్స్‌లో పుట్టపాక ఇక్కత్ ఎగ్జిబిషన్

సంస్థాన్ నారాయణపురం, జూలై 20: మారుతున్న కాలానికి అనుగుణంగా చేనేత కార్మికులు వినియోగదారుల అభిరుచులకు తగ్గట్టు అందమైన వస్త్రాలు ఉత్పత్తి చేస్తున్నారని ప్రముఖ యాంకర్, నటి సుమ కనకాల అన్నారు. ఫిక్కీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో శనివారం ఏర్పాటుచేసిన పుట్టపాక ఉమెన్స్ హ్యాండ్లూమ్స్ ఇక్కత్ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. పలు స్టాళ్లను పరిశీలించి చేనేత కార్మికులు తయారుచేసిన వస్త్రాలను తిలకించారు. తేలియా డబుల్ ఇక్కత్ దుప్పట్లను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పుట్టపాక చేనేత కార్మికులు తయారుచేసిన వస్త్రాలు నూతన డిజైన్లతో, వివిధ రంగులతో అందంగా ఉన్నాయని కొనియాడారు. ఇక్కత్ వస్త్రాలకు పుట్టపాక ప్రత్యేకమన్నారు. ప్రజలు చేనేత వస్త్రాలను ఆదరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పుట్టపాక ఉమెన్స్ హ్యాండ్లూమ్స్ ఇక్కత్ ప్రొడక్ట్ అధ్యక్షురాలు సామల విజయలక్ష్మి, కార్యదర్శి గజం పుష్పలత, పానుగంటి పద్మ, మాజీ సర్పంచ్ సామల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



పుట్టపాక వస్త్రాలను పరిశీలిస్తున్న యాంకర్ సుమ

సమయపాలన పాటించకపోతే చర్యలు

బీబీనగర్, జూలై 20 : వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని లేకుంటే కఠినచర్యలు తప్పవని కలెక్టర్ హనుమంతు కే జెండగే హెచ్చరించారు. శనివారం బీబీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది, హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, విధులకు గైర్హాజరైన సీనియర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారికి సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తం గా ఉండాలన్నారు. గర్భిణులకు అందిస్తున్న సేవలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. జ్వరాలు వచ్చి వారిని ఆశా, ఏఎన్ఎం సిబ్బంది తరచుగా పర్యవేక్షించి వైద్యం అందించాలన్నారు. నూతన ఆసుపత్రి భవనం 70శాతం పూర్తయిందని మిగతా పనులను తక్షణమే పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. అంతకుముందు ఆసుపత్రిలోని డ్రగ్ స్టోర్‌లో అందుబాటులో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి పాపారావు, పీహెచ్‌సీ డాక్టర్ మౌనిక ఉన్నారు.



బీబీనగర్ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

సాగు భూములను బెటాలియన్‌కు కేటాయించొద్దు

సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం, జూలై 20: పేద రైతులు సాగు చేసుకుంటున్న భూములను పోలీస్ బెటాలియన్‌కు అప్పగించడం సరికాదని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పోలీస్ బెటాలియన్‌కు కేటాయించనున్న 255 సర్వేనెంబర్ భూములను సీపీఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, యాదాద్రి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములుతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. భూములను సాగు చేసుకుంటున్న రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ, తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న రైతుల భూములను పోలీస్ బెటాలియన్‌కు తీసుకోవాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఈ భూములు రాళ్ల రప్పలుగా ఉండేవని, అలాంటి భూమిని లక్షలాది రూపాయలు వెచ్చించి చదును చేసి పేదలు ఏళ్లుగా సాగుచేసుకొని జీవిస్తున్నారని అన్నారు. సాగుకు భూములను బెటాలియన్‌కు కేటాయించడంతో రైతులు జీవనాధారం కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో 100మందికి పైగా రైతులతోపాటు పక్కనే ఉన్న గిరిజన తండా ప్రజలు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. బెటాలియన్ ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగని మరో ప్రాంతంలో బెటాలియన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

లేదంటే రైతుల పక్షాన సీపీఐ ఆధ్వర్యంలో పోరాడతామని అన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద శ్రీనివాస్, సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చనగొని గాలయ్య, మండల కార్యదర్శులు దుబ్బాక భాస్కర్, పల్లె శేఖర్‌రెడ్డి, దేశిడి నరేందర్‌రెడ్డి, చిలువేరు అంజయ్య, బొడ్డుపల్లి గాలయ్య, చిలువేరు నరసింహ, రమేష్, నరసింహనాయక్, తదితరులు పాల్గొన్నారు.



సంస్థాన్ నారాయణపురంలో బెటాలియన్‌కు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, తదితరులు

మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం చెల్లించాలి

భూదాన్ పోచంపల్లి, జూలై 20 : గౌరెల్లి-భద్రాచలం వరకు జాతీయరహదారి నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతులకు మార్కెట్ ధరకు అనుగుణంగా ఎకరాకు రూ.80 లక్షలు చెల్లించాలని భూనిర్వాసితులు చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డిని కోరారు. శనివారం మండలంలోని పిలాయిపల్లి, జగత్‌పల్లి గ్రామాలకు చెందిన భూనిర్వాసితులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆర్డీవో రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. పిలాయిపల్లి గ్రామంలోని 57 మందికి చెందిన 30 ఎకరాలు, జగత్‌పల్లి గ్రామంలో 25 మంది 10 ఎకరాల 6 గుంటల భూమిని కోల్పోతున్నారు. ఈ మేరకు రైతులతో సమావేశం నిర్వహించిన ఆర్డీవో శేఖర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ఇంకా ఏమైనా సందేహాలు, అభిప్రాయాలున్నా, ఎక్కువ నష్టపరిహారం కావాలనుకుంటే కలెక్టర్‌కు విన్నవించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీకాంత్‌రెడ్డి, డీఐ వెంకటయ్య, ఎంఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శేఖర్‌రెడ్డి

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు

భువనగిరి టౌన్, జూలై 20 : కళాశాలలో నూతన విద్యార్థులతో ర్యాగింగ్‌కు పాల్పడితే కఠినశిక్షలు తప్పవని జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి డీ నాగేశ్వర్‌రావు, ఏసీపీ రవికిరణ్‌రెడ్డి అన్నారు. భువనగిరి శివారులోని యూనిటీ ఫార్మసీ, పీజీ కళాశాలలో శనివారం నిర్వహించిన ర్యాగింగ్ నియంత్రణ అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ర్యాగింగ్ చేయబోమని ప్రతీ విద్యార్థి అఫిడవిట్ సమర్పించాలన్నారు. జూనియర్స్‌తో సీనియర్స్ కలివిడిగా ఉంటూ విద్యపై ఆసక్తి, అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో కళాశాల డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎస్.జైపాల్, డిప్యూటీ కౌన్సిల్ జీ శంకర్, లెక్చరర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి నాగేశ్వర్‌రావు

బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ కరువు

● పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ



జెండా ఆవిష్కరిస్తున్న పీవోడబ్ల్యూ నాయకులు

కోదాడటౌన్, జూలై 20: కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు రక్షణ కరువైందని పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు జి. ఝాన్సీ అన్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని లాల్ బంగాల్లో నిర్వహిస్తున్న సంఘం 7వ జిల్లా మహాసభలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైంగిక వేధింపులు, హత్యలు, లైంగికదాడులు, గృహహింస మరింత పెరగాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్త్రీ పురుష సమానత్వం కోసం సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమభాగస్వామ్యం కోసం సంఘం అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. లైగింక వేధింపుల నిరోధక చట్టం, గృహహింస నిరోధక చట్టాల కోసం వాటి అమలు కోసం పోరాడిందన్నారు. బిల్కిస్ బానుపై అమాయి త్యానికి పాల్పడి, ఆమె కుటుంబసభ్యుల హత్యకు పాల్పడిన వారిని విడుదల చేసి, సన్మానించడం దారుణమన్నారు. దేశంలో ఈ ఘటనలో బీజేపీ ప్రభుత్వ వైఖరి మహిళల పట్ల సృష్టీకరించిందన్నారు. భారత రాజ్యాంగ విరుద్ధంగా సీఏఏ, ఎన్ఆర్సీ, పౌర చట్టాలను తీసుకొచ్చి మతోన్మాదంతో వ్యవహరించిందని విమర్శించారు. అంతకుముందు సంఘం జిల్లా ఉపాధ్యాక్షురాలు రామలింగమ్మ జెండా ఎగరవేశారు. ఈ కార్యక్రమలో నాయకులు రామలింగమ్మ పి. లక్ష్మీ, వాణిశ్రీ, నాయకులు డేవిడ్‌కుమార్, వి. నరసింహారావు, కే. నర్సమ్మ, ఎం. రాజేశ్వరి, పి. సుజాత, బయ్య జయమ్మ, పి. ఐలమ్మ, లక్ష్మీ, శాంతమ్మ, జి. కావ్య, సైదమ్మ, లింగమ్మ, ఎస్. ఉపేంద్ర, జయసుధ, సంపూర్ణ, వి. సంతోష్ పాల్గొన్నారు.

ఆందోల్ మైసమ్మ బోనాల ఉత్సవాలు ప్రారంభం


పుట్టమన్ను తెస్తున్న దేవాదాయ సహాయ కమిషనర్, ఉత్సవ కమిటీ సభ్యులు

చౌటుప్పల్ రూరల్, జూలై 20: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని శ్రీ ఆందోల్‌మైసమ్మ బోనాల ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అఖండ దీపారాధన, గణపతి పూజ, పుణ్యావాచనం, సప్తపతి హోమం, ఆరగింపు, పుట్టమన్న తెచ్చుట కార్యక్రమలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆదివారం బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో దేవాదయ ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ మహేంద్రకుమార్, ఈవో మోహన్‌బాబు, దేవాలయ ఉత్సవ కమిటీ సభ్యులు చిలుకూరి మల్లారెడ్డి, చంద్రస్వామిగౌడ్, మదిగొండ రమేష్, గుండు శ్రీహరిగౌడ్, చిట్టంపల్లి జంగయ్య, ఈడ్దుల విజయ్, గంగాదర్, గణేష్, అత్తపురం అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పాఠశాలల పని వేళల్లో మార్పు

భువనగిరి టౌన్, జూలై 20: విద్యా శాఖ నిర్ణయం మేరకు సోమవారం నుంచి ప్రభుత్వ పాఠశాలల నూతన పని వేళలు అమలుల్లోకి రానున్నాయని యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్‌చార్జి డీఈవో ప్రశాంత్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4.15 వరకు కొనసాగుతాయని తెలిపారు. భోజన, ఇతర విరామ సమయాలు, సెలవులు యథావిధిగా ఉంటాయన్నారు. కాగా ఇటీవలి వరకు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు వేర్వేరు పని వేళలు ఉండేవి ప్రభుత్వ నిర్ణయంతో రేపటి నుంచి జిల్లాలోని 719 ప్రభుత్వ పాఠశాలల్లో ఒకే పని వేళలు అమల్లోకి రానున్నాయి.

సమస్యలు పరిష్కరించాలి

తుంగతుర్తి, జూలై 20: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు జ్యోతుల చంద్రశేఖర్ అన్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సంఘం సభ్యత్వాలు నమోదు చేయించారు. ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చింతరెడ్డి రామలింగారెడ్డి, గుజ్జ భాస్కర్, రాజన్న, హరికిషన్, చంద్రశేఖర్, రమేష్, అబ్బయ్య, యాకయ్య, సహదేవ్, ఎలిజబెత్, రఘుపతి, శ్రీరాములు, కవిత పాల్గొన్నారు.

క్రికెట్ జట్టు ఎంపిక వాయిదా

భానుపురి, జూలై 20: ఈనెల 21న జరగాల్సిన ఉమ్మడి నల్గొండ జిల్లా క్రికెట్ జట్టు ఎంపికను వాయిదా వేసినట్లు జిల్లా క్రికెట్ అసోషియేషన్ సెక్రటరీ నాయిని శ్రీనివాసారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలక్షన్స్ నిర్వహించే తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 949099916 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి


మాట్లాడుతున్న జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి లింగారెడ్డి

తుర్కపల్లి, జూలై 20: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో అవసరమని జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి పెసరు లింగారెడ్డి అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని దత్తాయపల్లి ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశం దోహదపడుతుందన్నారు. ప్రతినెలా మూడో శని వారం జరిగే సమావేశంలో పిల్లలకు ఏ మేరకు విద్య అందుతుందో తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కావాలన్నారు. తతనంతరం పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి తుర్కపల్లి, వెంకటాపూర్, దత్తాయపల్లి, ఇబ్రహీంపూర్ పాఠశాలలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. సమావేశంలో హెచ్ఎం వెంకట్‌రెడ్డి, అరుణ, డి. ప్రేమలత, బి. అనురాధ, వి. లక్ష్మణ్, సీఆర్పీ వీరేశం పాల్గొన్నారు.

నారసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి, జూలై 20: మట్టపల్లి లక్ష్మీనృసింహుడి క్షేత్రంలో రాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహుని నిత్యాకల్యాణం వేదపండితులు తూమాటి రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహామూర్తి, ఆంజనేయచార్యులు సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. స్వామి, రాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత భక్తవత్సలునికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. తర్వాత ఆలయ సంప్రదాయ ప్రకారం అర్జిత కైంకర్యాలు జరిగాయి. ఉదయం హోమాధికాల భక్తిశ్రద్ధలతో చేశారు. అనంతరం కల్యాణ మూర్తులను పరిణయోత్సవ వేదికపై వేంచేయించి పుణ్యాహవాచనం గావించారు. పాదప్రక్షాళనం మధుపర్క పూజలు యథావిధిగా నిర్వహించారు. మంగల్యధారణ, యజ్ఞోపవీత ధారణలు అనంతరం దివ్య మూర్తులకు గరుడోత్సవం జరిగింది. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్యాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ కోసం యువకుల శ్రమదానం


గాతు తీస్తున్న యువకులు

హుజూర్‌నగర్, జూలై 20: సూర్యాపేట జిల్లా మండలంలోని బూరుగడ్డలో యువత సామాజిక సేవలో భాగంగా పైప్‌లైన్ నిర్మాణం కోసం శనివారం శ్రమదానంతో గాతుతీశారు. గ్రామంలో నెలరోజులుగా విషజ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారు. గ్రామపంచాయతీ అధికారులు సక్రమంగా పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో డెంగీ, చికన్‌గున్యా, డయేరియా, మలేరియా వంటి విషజ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కొన్నిరోజులుగా మంచినీటి సమస్య తీవ్రం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పైప్‌లైన్ పగిలిపోయి నీరు నిలిచింది. అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోకపోవడంతో శనివారం స్వచ్ఛందంగా 20మంది యువకులు పలుగు, పార చేపట్టి గాడితవ్వారు. గ్రామపంచాయతీ సిబ్బంది పైప్‌లైన్‌కు మరమ్మతులు చేశారు. యువకులను గ్రామస్థులు అభినందించారు.

బాలికకు 'పేట' కలెక్టర్ ఆపన్నహస్తం



గురుకుల పాఠశాలలో చేరిన జ్యోత్స్న

హుజూర్‌నగర్, జూలై 20: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని ఎంపీపీ కాలనీకి చెందిన ఉదారి జ్యోత్స్న తల్లిదండ్రులు చనిపోయారు. ఆ విద్యార్థినికి కలెక్టర్ తేజస్ నందాలాల్‌పవార్ అండగా నిలిచారు. 'నాడు తల్లి.. నేడు తండ్రి మృతి' అనే శీర్షికన జూన్ 2న 'ఆంధ్రజ్యోతి'లో బాలికపై ప్రచురితమైన కథనానికి స్పందించారు. బాలికను ఆదుకుంటామని ఆయన ప్రకటించారు. దీంతో శనివారం హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని నేరేడుచర్ల మండలంలోని బీసీ గురుకుల పాఠశాలలో జ్యోత్సను చేర్పించారు. పట్టణంలోని ఎంపీపీ కాలనీకి చెందిన బాలిక తల్లి ఉదారి పార్వతి పదేళ్ల క్రితం చనిపోగా, డ్రైవర్‌గా పనిచేస్తున్న తండ్రి క్రాంతికుమార్ అనారోగ్యంతో జూన్ 2న చనిపోయాడు. దీంతో వృద్ధాప్యంలో ఉన్న నాయనమ్మ పుష్పావతి దగ్గర బాలిక ఉంటోంది. ఇదిలా ఉండగా పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదివిన జ్యోత్స్నను కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు గురుకుల పాఠశాలలో చేర్పించారు. ఇంటర్ వరకు అక్కడే ఉచితంగా విద్యాభ్యాసం చేసేందుకు జ్యోత్స్నకు అవకాశం వచ్చింది. కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు రవికుమార్, సాయిత్రిలోక్ పాల్గొన్నారు.

బెల్ట్‌షాప్‌ల నిర్మూలనకు ప్రతిజ్ఞ


బెల్ట్‌షాప్ నిర్మూలనకు ప్రతిజ్ఞ చేస్తున్న సింగారం గ్రామస్థులు

మునుగోడు రూరల్, జూలై 20: బెల్ట్‌షాపుల నిర్మూలనకు సూర్యాపేట జిల్లా మునుగోడు మండలంలోని సింగారం గ్రామంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామంలో బెల్ట్‌షాప్‌లు లేకుండా చేస్తామని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదేశాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, మండల అధ్యక్షుడు బీమనపల్లి సైదులు మాట్లాడుతూ గ్రామాల్లో మద్యం విక్రయాలు జరగకుండా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ఉండాలన్నారు. మద్యం విక్రయాలు జరగకుండా ఉంటే గ్రామాలు అన్నివిధాలా అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కుంభం చెన్నారెడ్డి, మాజీ సర్పంచ్ జిల్లా లక్ష్మమ్మ, పోగుల ప్రకాష్, దేప జాన్‌రెడ్డి, ఉప్పునూతల వెంకన్న, సోమగాని రమేష్, కుంభం రామ్‌రెడ్డి, రావుల నర్సింహ, పగిళ్ల శ్రీనివాస్, యంపల్ల వెంకన్న, జంగం చంద్రశేఖర్ రెడ్డి, కోడి అర్జున్, పిట్టల శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్‌శాఖలో
బదిలీల పర్వం షురూ

● తొలత 38 మంది జూనియర్ అసిస్టెంట్లకు స్థాన చలనం
● ఏ క్షణానైనా సబ్ రిజిస్ట్రార్ల బదిలీలకు ఉత్తర్వులు

నల్లగొండ, జూలై 20: ఉమ్మడి నల్లగొండ జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీల పర్వం మొదలైంది. తొలత ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని వివిధ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న 38 మంది జూనియర్ అసిస్టెంట్లకు స్థానచలనం కల్పించారు. అటెండర్ నుంచి మొదలుకొని సబ్ రిజిస్ట్రార్ వరకు అన్ని స్థాయిల ఉద్యోగులను బదిలీ చేయడానికి నిర్ణయించారు. ఒకే చోట రెండేళ్ల అంతకన్నా ఎక్కువ కాలం సర్వీస్‌లో ఉన్న వారందరినీ బదిలీ చేస్తున్నారు. జిల్లాలోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న సబ్ రిజిస్ట్రార్లతో పాటు గ్రేడ్ -1, గ్రేడ్ -2 సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, అంటెడర్లను బదిలీ చేయడానికి నిర్ణయించారు. ఏ క్షణాన అయినా రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసుకొన్ని సబ్ రిజిస్ట్రార్లను బదిలీ చేయడానికి ఉత్తర్వులు రానున్నాయి. శనివారం రాత్రి లేదా ఆదివారం ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. సోమవారం నాటికి బదిలీల ప్రక్రియ పూర్తిగా కానుంది. ఈ బదిలీల కోసం ప్రభుత్వం మూడు రోజుల క్రితం ఉద్యోగుల నుంచి ఆప్షన్లను కోరింది. ఒకొక్కరూ 5 ఆప్షన్లను ఇస్తూ దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈ నేపథ్యంలోనే బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది.

వ్యవసాయశాఖలో బదిలీలు వాయిదా..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పంటల రుణమాఫీ పథకం మొదలైనందున ఆ శాఖలో బదిలీల ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేశారు. రుణమాఫీ పూర్తి అయ్యే వరకు ప్రస్తుతం పనిచేస్తున్న చోటే ఉండే విధంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆదేశాలు జారీ చేసింది. వ్యవసాయ శాఖలో నాలుగు కేటగిరీలలో అధికారుల బదిలీలను తాత్కాలికంగా నిలిపివేశారు. రుణమాఫీ అమలయ్యేంత వరకు ఏఈవోలు, ఏంఏవోలు, ఏడీలు, డీఏవోల బదిలీలను నిలిపివేశారు. ఇప్పటికే సర్వీస్ పూర్తి అయిన వారిని బదిలీ చేయాల్సి ఉన్నా ఆ ప్రక్రియను నిలిపివేశారు. దీంతో త్వరలోనే బదిలీలు చేపట్టనున్నారు. ఇకపోతే పశుసంవర్థక శాఖలో కూడా బదిలీలకు సంబంధించి హైదరాబాద్‌లో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. సోమవారం లోగా ఆ శాఖలో బదిలీలు కానున్నాయి.

లారీని ఢీకొన్న డీసీఎం : డ్రైవర్ దుర్మరణం



ప్రమాదంలో నుజ్జునుయిన డీసీఎం

కట్టంగూరు, జూలై 20: ముందు వెళ్తున్న లారీని అతివేగం, అజాగ్రత్తతో డీసీ ఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విశ్రాంతి తీసుకుంటున్న డ్రైవర్(రెండో డ్రైవర్) మృతి చెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలో శనివారం జరిగింది. ఎస్ఐ ఎస్.శ్రీను తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రానికి చెందిన లారీ విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తోంది. అదే వైపు నుం చి వస్తున్న డీసీఎం డ్రైవర్ వాహనాన్ని అజాగ్రత్తగా అతివేగంగా నడుపుతూ ముం దుగా వెళ్తున్న లారీని వెనక నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో రెండవ డ్రైవర్ అయిన కండక్టర్ సీట్‌లో కూర్చున్న పంజాబ్‌కు చెందిన పులివిందర్ సింగ్(25) అక్కడికక్కడే మృతి చెందాడు. డీసీఎం నడుపుతున్న పంజాబ్ రాష్ట్రానికి చెందిన డ్రైవర్ రాజుబిందర్ సింగ్‌కు స్వల్పగాయాలయ్యాయి. డీసీఎం క్యాబిన్ నుజ్జయి అయి లారీలోకి చిక్కుకపోవడంతో డీసీఎంను పోలీసులు ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించారు. ఈ ప్రమాదంతో వాహనాలు రెండు జాతీయ రహదారిపై అడ్డంగా ఉండటంతో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న వాహనాలను కొద్దిసేపు కట్టంగూరులోని సర్వీస్ రోడ్డు గుండా హైదరాబాద్ తరలించారు. ఎక్స్‌కవేటర్ సహాయంతో రెండు వాహనాలను రోడ్డు ప్రక్కకు తొలగించారు. మృతదేహాన్ని నార్కట్‌పల్లి సమీపంలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాసారంలో ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ

దేవరకొండ, జూలై 20: నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కాసారం గ్రామంలో ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ చేశారు. సీఐ నర్సింహులు శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కాసారం లింగమ్మ శనివారం ఉదయం భర్తతో కలిసి వ్యవసాయ పనులకు ఇంటికి తాళంవేసి వెళ్లింది. గుర్తుతెలియని వ్యక్తులు తాళాలుపగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో దొంగతనం జరిగిందని తెలుసుకొని దేవరకొండకు చేరుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తులం బంగారం, 12 తులాల వెండి, రూ.8వేల నగదును అపహరించారు. లింగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కుక్క దాడిలో ఒకరికి తీవ్రగాయాలు

నార్కట్‌పల్లి, జూలై 20: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రంలో కుక్క దాడిలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. శనివారం జడ్పీహెచ్ఎస్ సమీపంలో ఈ ఘటన జరిగింది. హైస్కూల్ పక్క నుంచి ఉప్పలయ్య అనే వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా అదే కాలనీలోని దాసరి రంగయ్యకు చెందిన పెంపుడు కుక్క ఒక్కసారిగా దాడి చేసింది. కాలికండ కొరికి తీవ్రగాయం చేయడంతో తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే సమీపంలో ఉన్న వాళ్లు రావడంతో కుక్క వదిలేసింది. ఇదిలా ఉంటే కుక్కల బెడద నుంచి తమను రక్షించకపోతే గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని బాధిత కాలనీ వాసులు హెచ్చరిస్తున్నారు. గతంలో కూడా ఇదే కుక్క పలువురిని కరిచి గాయపర్చిందని ఆరోపిస్తున్నారు. అదేవిధంగా పట్టణంలో కుక్కల బెడద తీవ్రమైందని రాత్రివేళ డ్యూటీలు చేసి ఇంటికి వస్తున్న సమయంలో కుక్కలు ఎగబడి కరుస్తున్నాయని పలువురు ఆందోళన చెందుతున్నారు.

గుండెపోటుతో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ మృతి



ప్రదీప్ (ఫైల్)

నార్కట్‌పల్లి, జూలై 20: నార్కట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ కోమటి ప్రదీప్ (56) గుండెపోటుతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. బదిలీ ప్రక్రియకు సంబంధించి కౌన్సెలింగ్ కోసం శుక్రవారం రాత్రి సుమారు 8 గంటల వరకు నల్లగొండ జిల్లా పరిషత్ కార్యాలయంలోనే ఉన్న ప్రదీప్ రాత్రి 10.00గంటల సమయంలో హైదరాబాద్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. ఇంటికి చేరిన కొద్దిసేపటకే ప్రదీప్ వాంతులు చేసుకున్నాడని కుటుంబసభ్యులు తెలిపారు. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే గుండెపోటు వచ్చి చనిపోయాడని వైద్యులు చెప్పారు. కాగా ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల్లో భాగంగా ప్రదీప్‌కు నకిరేకల్ మండల పరిషత్ కార్యాలయానికి బదిలీ అయినట్లు తెలిసింది.

పలువురి సంతాపం: అందరితో మృదువుగా మాట్లాడుతూ మంచి ఉద్యోగిగా పేరు తెచ్చుకున్న ప్రదీప్ అకాల మరణం పట్ల పలువురు సంతాపం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రదీప్ చిత్రపటానికి మాజీ ప్రజాప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు పుల్లెంల ముత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, చిరుమర్తి యాదయ్య, వాజిద్, దుబ్బాక శ్రీధర్, పుల్లెంల అచ్చాలు, వేముల నర్సింహ, సత్తిరెడ్డి, ఏపీవో యాదయ్య, ఏపీఎం చంద్రకళ, రాంబాబు, నర్సింహారెడ్డి పాల్గొన్నారు. కాగా హైదరాబాద్‌లో జరిగిన అంత్యక్రియల్లో ఎంపీడీవో ఉమేశ్‌చారి, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని భాస్కర్‌రెడ్డి, విజయ, నర్సింహ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్ కల్పించాలి

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

నకిరేకల్, జూలై 20: విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీసీలకు రిజర్వేషన్ సమగ్ర కుల గణన కల్పించాలని, ఈ నెల 14వ తేదీన చేపట్టిన యాత్ర శనివారం నల్లగొండ జిల్లా నకిరేకల్‌కు చేరింది. ఈ సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు దామాషా ప్రకారం అన్ని రంగాల్లో రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వం బీసీ వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ కులగణన చేపట్టలేదని, వెంటనే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించి బీసీలకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో బీసీ కుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు కుందారపు గణేష్‌చారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అర్రూరి వెంకటేశ్వర్లు, బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సకినాల రవి, నాయకులు తిరుగుడు రవి, పగిళ్ల వెంకన్న, మేడిపల్లి సైదులు, చిలుకూరి లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇక్కత్ గాయబ్

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ పట్టుచీరల డిజైన్లకు ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. పేటెంట్ హక్కు కలిగిన పోచంపల్లి చేనేత ఇక్కత్ పట్టుచీరల డిజైన్లు కాపీకి గురవుతున్నాయి. భౌగోళిక గుర్తింపు జియోగ్రాఫికల్ ఇండికేషన్ యాక్ట్(జీఐఏ) ట్యాగ్ కలిగిన పోచంపల్లి ఇక్కత్ డిజైన్లను కొందరు బడా వ్యాపారులు కాపీ కొట్టి పవర్ లూమ్‌లపై ప్రింటెడ్ పాలిస్టర్ చీరలను తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇవి మార్కెట్లో అతి తక్కువ ధరలకు దొరుకుతున్నాయి. దీంతో పోచంపల్లి ఇక్కత్ పట్టు చీరకు మార్కెట్ తగ్గి నేడు ప్రమాదంలో పడింది.

- భూదాన్‌పోచంపల్లి



'అగ్గిపెట్టెలో పట్టేంత చీరను నేసి భారతీయ సంస్కృతిని ప్రపంచ నలుదిశలా వ్యాపింపజేసిన కళాప్రతిభ పోచంపల్లి చేనేత కార్మికులది. రాట్నం నుంచి దారం వడికి పోగుపోగును ఏకం చేసి రంగురంగులతో చిత్రమైన చీరను నేసే పనితనం వారిది. 50 ఏళ్ల శ్రమకు నిలువెత్తు నిదర్శనంగా చేనేత డిజైన్‌కు పేటెంట్ హక్కును పొందిన ఘనత ఈ ప్రాంతానిదే. కానీ, ప్రైవేటు పవర్ మిల్లులు చేనేత కార్మికుల కష్టాన్ని కాపీ కొడుతున్నాయి. పేటెంట్ హక్కును కాలరాస్తున్నారు. కృత్రిమ ఉత్పత్తుల కంటే సహజసిద్ధంగా తయారైన ఉత్పత్తులకు ప్రజల్లో ఆదరణ ఉంటుంది. ఈక్రమంలోనే చేనేత ఇక్కత్, ఖాదీ వస్త్రాలకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లో అనూహ్యంగా డిమాండ్ పెరిగింది. ఇదే అదనుగా కొందరు అసలుకు నకిలీవి సృష్టించి వినియోగదారులను దారుణంగా మోసగించడమే కాకుండా చేనేత కార్మికుల పొట్ట కొడుతున్నారు. మార్కెట్లో ఉండే వస్త్రాల్లో నూటికి 90 షోరూముల్లో అసలైన చేనేత వస్త్రాల పేరిట పవర్‌లూమ్ ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. జీఐఏ ట్యాగ్ కలిగిన ఇక్కత్ డిజైన్లను కొందరు బడా వ్యాపారులు కాపీ చేసి విక్రయిస్తున్నారు. నేతన్న నేసే పట్టుచీర డిజైన్‌ను బట్టి గరిష్టంగా రూ.20 వేలు పలుకుతుండగా ప్రింటెడ్ పట్టుచీరల పేరుతో వస్తున్న చీరలు కేవలం రూ.600కే మార్కెట్లో దొరుకుతున్నాయి. దీంతో వినియోగదారులు ప్రింటెడ్ చీరల వైపే మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా పట్టుచీరల బ్రాండ్ ఇమేజ్ దెబ్బతినడంతోపాటు చేనేత వృత్తిదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో 52 వేల మంది చేనేత వృత్తిదారుల జీవనోపాధిపై ప్రింటెడ్ చీరలు అశనిపాతంగా మారాయి. చేనేత ఇక్కత్ డిజైన్లు కాపీకి గురికాకుండా ప్రభుత్వం పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని చేనేత సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

భారీగా నష్టపోతున్న వ్యాపారులు

ఉమ్మడి నల్లగొండ, వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లో సుమారు 12వేల మంది చేనేత కళాకారులు జియో ట్యాగ్ కలిగి ఉన్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఒక జియో ట్యాగ్ కళాకారుడితో పాటు మరో ఇద్దరు అనుబంధ చేనేత కళాకారులు ఉంటారు. ఈ లెక్కన 36వేల మంది చేనేత కళాకారులు నేరుగా ఈ వృత్తిలో ఉన్నారు. నెలకు ఒక చేనేత కుటుంబం ఐదు చీరలు తయారు చేస్తోంది. ఇలా తయారైన చీరలతో భూదాన్‌పోచంపల్లిలోనే సుమారు రూ.40 కోట్ల మేరకు వ్యాపారం జరిగేది. ప్రస్తుతం ప్రింటెడ్ చీరల రాకతో రూ.12 కోట్లకు పడిపోయింది. దీంతో వ్యాపారం పూర్తిగా పడిపోయిందని చేనేత టైఅండ్‌డై ఇక్కత్ వస్త్ర వ్యాపారులు చెబుతున్నారు. పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ పట్టు చీరల డిజైన్ల ప్రింటెడ్ చీరలు ఇప్పుడు గ్రామాల్లో మూటల వ్యాపారులు సైతం విక్రయిస్తున్నారు. గతంలో నగరాల్లోని పెద్ద పెద్ద మాల్స్ లోనే లభించే ప్రింటెడ్ చీరలు ఇప్పుడు పల్లెల్లోనూ విరివిగా విక్రయాలు సాగిస్తున్నారు. ప్రింటెడ్ చీరల విక్రయాలను అరికట్టాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో పోచంపల్లి ఇక్కత్ చీరల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

హ్యాండ్లూమ్ పార్క్ కోసం ఎదురుచూపులు

అప్పులభారంతో మూతపడిన పోచంపల్లి హ్యాండ్లూమ్‌పార్క్ మళ్లీ తెరుచుకోనుందా? అని కార్మికులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బ్యాంకుల వేలంలో యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం కనుముకుల గ్రామంలోని పోచంపల్లి హ్యాండ్లూమ్‌పార్క్ రూ.12.60కోట్లకు సొంతం చేసుకుంది. 2008లో కేంద్రప్రభుత్వ స్కీమ్ ఫర్ ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ పార్క్‌ల పథకం ఈ పార్క్‌ను నెలకొల్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా వర్కింగ్ క్యాపిటల్‌గా కాకుండా ఎస్‌హెచ్‌డీసీకి కేంద్రం చెల్లించింది. దీంతో పార్క్ నిర్వహణకు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారు. రుణగ్రహీతలు బ్యాంకులకు సకాలంలో బకాయిలు చెల్లించకపోవడంతో గత ఏడాది ఆగస్టు 12న పార్క్ ఆస్తులను జప్తు చేస్తూ సీజ్ చేశాయి. బ్యాంక్ తాకట్టు నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకోవడంతో కార్మికుల్లో హ్యాండ్లూమ్ పార్క్‌పై ఆశలు చిగురించాయి. హ్యాండ్లూమ్ పార్క్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్(ఐఐహెచ్‌టీ) ఏర్పాటు చేయాలని ఇక్కడి చేనేత వర్గాలు కోరుతున్నాయి.

చేనేత దుకాణదారులను ఆదుకోవాలి



పోచంపల్లి చేనేత టైఅండ్‌డై వస్త్రోత్పత్తి దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బహిరంగ మార్కెట్లో వస్త్రాల కొనుగోళ్లు తగ్గిపోవడంతో ఉత్పత్తిదారులు వస్త్రాలు నేయడం బంద్ చేశారు. కార్మికులకు పనిదొరకడం లేదు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేనేత కార్మికుల పాలిట శాపంగా మారింది. చేనేత సహకార, సహకారేతర రంగంలోని కార్మికులకు ప్రభుత్వం ద్వారా పూర్తి స్థాయిలో పని కల్పించాల్సిన అవసరం నెలకొంది. దుకాణదారులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించి ప్రోత్సహించాలి. పోచంపల్లి ఇక్కత్ డిజైన్లను కాపీ కొడుతున్న ప్రింటింగ్ మిల్లు యజమానులపై తక్షణ చర్యలు తీసుకోవాలి.

- భారత లవకుమార్, పోచంపల్లి చేనేత టై అండ్‌డై అసోసియేషన్ అధ్యక్షుడు

బడా వస్త్ర వ్యాపార సంస్థలపై విస్తృతంగా దాడులు చేస్తాం



పోచంపల్లి ఇక్కత్ పట్టుచీరల డిజైన్లకు పేటెంట్ హక్కులు ఉన్నాయి. పోచంపల్లి పట్టు చీరలను పోలిన ప్రింటెడ్ చీరలు సూ రత్ నుంచి వస్తున్నాయి. షాపింగ్ మాల్స్, బడా వస్త్ర వ్యాపార సంస్థలు ప్రింటెడ్ వస్త్రాలు విక్రయిస్తున్నారే విషయాన్ని గుర్తించి దాడులు నిర్వహిస్తున్నాం. ఇక్కత్ డిజైన్‌ను కాపీతో ప్రింట్ చేసి చీరలను విక్రయిస్తున్నారు. చేనేత వృత్తిదారులకు ఇది తీరని నష్టం కలిగిస్తోంది. త్వరలో మాల్స్‌పై విస్తృతంగా దాడులు నిర్వహించి ఇక్కత్ డిజైన్ల కాపీపై కేసులు పెడతాం.

- వెంకటేశం, రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి

ఎనిమిది మంది గంజాయి విక్రేతల అరెస్ట్

● వివరాలు వెల్లడించిన ఎస్పీ శరత్‌చంద్ర పవార్



మునుగోడులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

మునుగోడు, సూర్యాపేట క్రైం, నల్లగొండ క్రైం, జూలై 20: నల్లగొండ జిల్లా మునుగోడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీదేవిగూడెంలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులకు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.25వేల విలువైన కిలో బరువున్న ఐదు గంజాయి ప్యాకెట్లు, నాలుగు సెల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు శనివారం సాయంత్రం మునుగోడు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుమీడియా సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ వివరాలు వెల్లడించారు. మునుగోడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీదేవిగూడెం పశువుల సంత షెడ్‌లో గంజాయి విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. అక్కడ అనుమానాస్పదంగా ఉన్న వారి వివరాలు సేకరించగా, మునుగోడు మండలం కొరటికల్ గ్రామానికి చెందిన బొల్లం వెంకటేశం, చండూరు మండలం కురంపల్లి గ్రామానికి చెందిన దోటి రామరాజు, మునుగోడు మండలం కమ్మగూడెంకు చెందిన అర్నెల్లి వికాస్ వర్ధన్, మునుగోడు మండలం కొంపల్లి గ్రామానికి చెందిన వీరమల్ల లింగస్వామి, గుర్రంపోడు మండలం బొల్లారం గ్రామానికి చెందిన పురం గణేష్‌గా గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని పూర్తిస్థాయిలో విచారించారు. విచారణలో వారు గంజాయిని విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. హైదరాబాద్‌లోని దూల్‌పేట ఏరియాలో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి మునుగోడు చుట్టుపక్కల వారికి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద పట్టుబడ్డ ఐదు గంజాయి ప్యాకెట్లలో ఒక్కోటి 200గ్రాములు ఉండగా, ఒక్కో ప్యాకెట్ రూ.2వేలు చొప్పున రూ.10వేలకు కొనుగోలు చేసుకొని ఇక్కడ తీసుకొచ్చి స్నేహితుల ద్వారా ఎక్కువ ధరకు విక్రయానికి సిద్ధంగా ఉన్న క్రమంలో పట్టుబడ్డారు. వీరు ఇచ్చిన సమాచారంపై పరిసర గ్రామాలకు చెందిన 35మంది బాధితులను గుర్తించి పరీక్షలు జరపగా గంజాయి సేవించినట్లు గుర్తించారు. మత్తుబారిన పడిన వారికి విముక్తి కల్పించేందుకు ప్రత్యేక కౌన్సెలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ తెలిపారు. ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. గంజాయి కేసును ఛేదించిన డీఎస్పీ శివరాంరెడ్డి, చండూరు సీఐ వెంకటయ్య, మునుగోడు ఎస్ఐ సీహెచ్.వెంకటేశ్వర్లుతో పాటు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

సూర్యాపేటలో ముగ్గురి అరెస్టు

నిషేధిత గంజాయిని సేవిస్తూ ఇతరులకు విక్రయించే ముగ్గురు వ్యక్తులను సూర్యాపేట పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ వెల్లడించారు. సూర్యాపేట పట్టణ పోలీసులు శనివారం ఉదయం 6 గంటల సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. పట్టణంలోని పాత వ్యవసాయ మార్కెట్ వద్ద మోతె మండల కేంద్రానికి చెందిన విద్యార్థి దామెర్ల మహేష్ పట్టణంలోని జేజే నగర్‌కు చెందిన కారు డ్రైవర్ చిరువేరు ప్రభుకిరణ్ భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన పెయింట్ పనిచేసే తండు మహేష్, పట్టణంలోని కస్తూరి బజార్‌కు చెందిన కూలీ పనిచేసే కానుకుర్తి సాయినవీన్ గంజాయి సేవిస్తూ అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులు వారి వద్దకు చేరుకునేలోపు సాయినవీన్ పోలీసులను చూసి పరారయ్యాడు. మిగిలిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా వారివద్ద 300 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. వెంటనే వారిని స్టేషన్‌కు తీసుకెళ్లి కేసు నమోదు చేసి కోర్టు రిమాండ్‌కు తరలించినట్లు రాజశేఖర్ తెలిపారు. సమావేశంలో పట్టణ ఎస్ఐ మహేందర్ నాథ్, సిబ్బంది జి. కృష్ణయ్య, కర్ణాకర్, సైదులు, ఆనంద్, మధు పాల్గొన్నారు.

రూ. 10లక్షల నిషేధిత గుట్కాలు స్వాధీనం

నల్లగొండ జిల్లా కేంద్ర పరిధిలో శుక్రవారం రాత్రి రూ.10లక్షల విలువైన నిషేధిత గుట్కాలను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పరిధిలోని ప్రకాశంబజార్‌లో ఓలా లక్ష్మీనారాయణ అనే వ్యాపారి వద్ద గుట్కాలు నిల్వ ఉన్నాయనే సమాచారంతో వన్‌టౌన్ సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సంయుక్తంగా దాడులు నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు రూ.10లక్షల విలువైన నిషేధిత గుట్కా బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతరంగా నిఘా పెడుతూ అక్రమ వ్యాపారాలు, నిషేధిత గుట్కాలు, గంజాయి, జూదం, మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. దాడుల్లో వన్‌టౌన్ ఎస్ఐ వీ.శంకర్, సిబ్బంది కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

● కేసు నమోదు



ఐశ్వర్య (ఫైల్)

తిప్పర్తి, జూలై 20: ఓ యు వతి అదృశ్యమైంది. ఈ ఘటనపై నల్లగొండ జిల్లా తిప్పర్తి పో లీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తిప్పర్తి మండల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దసూరారం గ్రామానికి చెందిన గుండె కోటయ్య కుమార్తె గుండె ఐశ్వర్య (19) రెండు సంవత్సరాల క్రితం ఇంటర్ పూర్తి చేసి ఇం టి వద్దనే ఉంటుంది. శుక్రవారం మధ్యాహ్నం కిరాణ దుకాణం వద్దకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లింది. ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తండ్రి కోటయ్య బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి. రాజు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



సుగుణమ్మ (ఫైల్)

చిట్యాల, జూలై 20: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై చికి త్స పొందుతూ ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలో శుక్రవారం అర్ధ రాత్రి చోటుచేసుకుంది. చిట్యాల ఎస్ఐ సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 19వ తేదీన అర్ధ రాత్రి చిట్యాల పట్టణంలో సంగిశెట్టి సుగుణమ్మ (68) రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు నార్కట్‌పల్లి సమీపంలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. దీంతో ఆమె చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ సైదాబాబు తెలిపారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, జూలై 20: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్యపూజలు జరిగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చక స్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అదేవిధంగా అష్ట భుజి ప్రాకారమండపంలో స్వామి, అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిగాయి. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరస్వామికి, మహామడపంలో స్పటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.15,43,717 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, స్వామివారిని హైకోర్టు న్యాయమూర్తి మౌషీమి భట్టాచార్య కుటుంబసమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వారికి వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా, లడ్డూ ప్రసాదాన్ని ఈవో భాస్కర్‌రావు అందజేశారు. కాగా, ఎడతెరపి లేకుండా కురిసిన ముసురుకు ప్రతీ వారం నిర్వహించే సంగీత సభలను రద్దు చేశారు.

ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్న మూసీ కాలుష్యం



సమావేశంలో మాట్లాడుతున్న అఖిలభారత కిసాన్ సభ జాతీయ నాయకుడు మల్లారెడ్డి

భువనగిరి టౌన్, జూలై 20: మూసీ నది కాలుష్యం ఉమ్మడి జిల్లా ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందని అఖిలభారత కిసాన్ సభ జాతీయ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. మూసీ ప్రక్షాళన, కృష్ణా, గోదావరి జలాల సాధనపై శనివారం భువనగిరిలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీ నీటితో పండిన పంటను ఆహారంగా తీసుకున్నా ప్రజల్లో క్యాన్సర్, చర్మ వ్యాధులు, మహిళల్లో గర్భకోశవ్యాధులు తలెత్తుతున్నాయన్నారు. ప్రతిరోజూ మూసీ నది 1650మిలియన్ గ్యాలరీ లీటర్స్ కాలుష్య జలాలను విడుదల చేస్తుండగా కేవలం 700 మిలియన్ గ్యాలరీ లీటర్లను మాత్రమే ప్రభుత్వం శుద్ధి చేస్తోందన్నారు. అయితే శుద్ధి చేసిన నీరు కూడా తిరిగి నదిలోనే కలుపుతుండడం ఆశ్చర్యార్థకమన్నారు. మూసీ నదిని ప్రక్షాళన చేయడంతో పాటు సాగు, తాగు నీటి అవసరాల కోసం కృష్ణ, గోదావరి జలాలను జిల్లాకు మళ్లించాలన్నారు. మూసీ నది ప్రక్షాళనపై ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు, నిధుల మంజూరు హామీలకే పరిమితం అవుతోందని విమర్శించారు. ఇందు కోసం చేపడుతున్న ఉద్యమాలకు ప్రజలందరూ స్వచ్ఛందంగా సహకరించాలన్నారు. సీనియర్ జర్నలిస్టు పిట్టల శ్రీశైలం, ప్రజా సంఘాల నాయకులు ఎండి.జహంగీర్, అనురాధ, బాల్‌రాజు, కొండమడుగు నర్సింహ, మేక అశోక్‌రెడ్డి, కల్లూరి మల్లేశం, మామిడి వెంకటరెడ్డి, మంచాల మధు, బుచ్చయ్య పాల్గొన్నారు.

కోర్టు వాయిదాలకు గైర్హాజరవుతున్న 61 మంది జైలుకు

● దొంగతనాల నివారణకు నిఘా పెంచాలి: డీసీపీ రాజేష్ చంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ రాజేష్‌చంద్ర

భువనగిరి టౌన్, జూలై 20: కోర్టు వాయిదాలకు వరుసగా గైర్హాజరవుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ ఎం.రాజేష్‌చంద్ర హెచ్చరించారు. శనివారం భువనగిరిలో నిర్వహించిన రాచకొండ కమిషనరేట్ యాదాద్రి జోన్ క్రైం సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు నెలలుగా పలు కారణాలు చూపుతూ కోర్టు వాయిదాలకు గైర్హాజరవుతున్న 61మందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్ ఖైదీలుగా జైలుకు పంపినట్లు తెలిపారు. ఈ తరహా నిందితులపై అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ఎస్‌హెచ్‌వోలు అవసరమైన సహకారాన్ని కోర్టులకు అందించాలన్నారు. దొంగతనాల నివారణకు పోలీస్ స్టేషన్ల వారీగా నిఘా పెంచాలని ఆదేశించారు. ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ దరఖాస్తుదారులకు న్యాయం చేయాలని, దోషుల పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. అనుమానాస్పద ఘటనలు వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీస్ స్టేషన్ వారిగా క్రైం, కేసుల వివరాలను సమీక్షించి పలు సూచనలు చేశారు. అడిషనల్ డీసీపీ, ఏసీపీలు, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

రాజాపేటలో శతాధికవృద్ధురాలు కన్నుమూత



ఎల్లమ్మ (ఫైల్‌ఫొటో)

రాజాపేట, జూలై 20: రాజాపేట మండల కేంద్రానికి చెందిన శతాధికవృద్ధురాలు తాళ్ళపల్లి ఎల్లమ్మ (101) శనివారం మృతి కన్నుమూసింది. ఆమె కొద్దికాలంగా అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె మూడు తరాలను చూడగా, ఆమె కుమారులు, మనుమలు, మనుమరాళ్లు కలిపి 30మంది ఉన్నారు.

బావిలోపడి గాయపడిన రైతు మృతి

రాజాపేట, జూలై 20: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో జారి పడి గాయాలపాలయ్యి చికిత్స పొందుతూ రైతు మృతి చెందిన సంఘటన రాజాపేట మండలం కుర్రారం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుర్రారం గ్రామంలోని నిమ్మల అనంతరెడ్డి(50) వ్యవసాయం చేస్తూ జీవనం గడుపుతున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రోజు మాదిరిగానే వ్యవసాయం పొలం వద్దకు వెళ్లి పనులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి అనంతరెడ్డి ఇంటికి రాకపోవడంతో భార్య అంజమ్మ, కొంతమందితో కలిసి బావి వద్దకు వెళ్లి పరిశీలించగా, బావిలో పడ్డట్టు గమనించారు. అతడిని భువనగిరి ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

సాదాబైనామాలకు మోక్షం ఎప్పుడో?

- దరఖాస్తుదారుల ఎదురుచూపులు
- భూముల ధరలు పెరగడంతో జటిలమవుతున్న సమస్య

అడ్డగూడూరు, జూలై 20: పట్టా పాసు పుస్తకం హక్కు కోసం చిన్న, సన్నకారు రైతులు సాదాబైనామా దరఖాస్తు చేసుకుని ఆశగా ఎదురుచూస్తున్నారు. తెల్ల కాగితాలు, స్టాంప్ పేపర్లతో భూ కొనుగోలు ఒప్పందం చేసుకున్న రైతులు రిజిస్ట్రేషన్ కోసం మీసేవలో కేంద్రాల ద్వారా మూడున్నరేళ్ల క్రిత్రం దరఖాస్తూ చేసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సాదాబైనామా దరఖాస్తులను స్వీకరించారు. అయితే ఎలాంటి రిజిస్ట్రేషన్ రుసుము లేకుండా కేవలం యూజర్ చార్జీలను మాత్రమే తీసుకుని దరఖాస్తులను రాష్ట్ర ప్రభుత్వం స్వీకరించింది. దీంతో ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం వచ్చింది. అయితే నేటికీ ఒక్కంటంటే ఒక్క సాదాబైనామా దరఖాస్తుకు పట్టా మంజూరు కాలేదని దరఖాస్తు చేసిన రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం భూమి సాగులో ఒకరు ఉండి రికార్డుల్లో మరొకరు ఉండటంతో రికార్డుల్లో పేరు నమోదై ఉన్న వ్యక్తుల వారసులు, కుటుంబ సభ్యులు అభ్యంతరాలు

ఆశలు ఆవిరేనా..?

కొన్ని దశబ్దాల భూ సమస్యలకు సాదాబైనామా ద్వారా పరిష్కారం దొరుకుతుందని ఆశ పడిన చిన్న, సన్నకారు రైతులకు ఎదురుచూపులు తప్పడంలేదు. పట్టా భూమూలకు మాత్రమే ప్రభుత్వ పథకాలైన రైతు బంధు, రైతు బీమా, బ్యాంకుల్లో రుణాలు వర్తింపజేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కూడా అందుతుంది. సాదాబైనామా ద్వారా పట్టాలు వస్తే తాము కూడా ప్రభుత్వ పథకాలు పొందవచ్చనే ఆశలో ఉన్న రైతులు ఉన్నారు. దరఖాస్తు పరిశీలన, పట్టాల మంజూరుకు సంబంధించి ఇంత వరకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు అందలేదని తహసీల్దార్ పేర్కొంటుండటం గమనార్హం.



తెలుపుతుండడంతో సమస్య వస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వం తాజాగా ధరణిలో పెండింగ్ రికార్డుల పరిష్కారానికి కృషి చేస్తున్న నేపథ్యంలో సాదబైనామా దరఖాస్తులు ఎప్పుడు పరిష్కారిస్తారని పలువురు రైతులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.


మారుతున్న పరిస్థితులు

నాలుగైదు దశాబ్దాల కిందట వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాలు క్రయవిక్రయాలు కేవలం కాగితాలపైనే జరిగేవి. ఆ తర్వాత కొన్నాళ్లకు స్టాంపు పేపర్లపై రాసుకునేవారు. తమ పూర్వీకులు ఇతరులకు విక్రయించినట్లు చిన్న కాగితం ఉన్నా వారి వారసులు ఆ భూముల జోలికి వెళ్లేవారు కాదు. ప్రస్తుతం పరిస్థితులు మారిపోయాయి. భూమూలు ధర పెరగడంతో స్థిరాస్తి వ్యాపారం జోరందుకుంది. రికార్డుల్లో తమ పేర్లు ఉన్నాయంటూ కొందరు వారసులు తిరగడుతున్నారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నామని, ఇప్పుడు వచ్చి ఆ భూములు తమవి అంటే ఎలా అంటూ వివాదాలు సృష్టిసున్నారు. కొందరు సమస్య పరిష్కారం కోసం పోలీసులను ఆశ్రయిస్తున్నారు. సాదాబైనామా దరఖాస్తులను ప్రభుత్వం 2020 అక్టోబరు 21 నుంచి అదే ఏడాది నవంబరు 10వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా మీ సేవా కేంద్రాల ద్వారా స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 9.8 లక్షల వరకు సాదాబైనామా దరఖాస్తులు వచ్చినట్లు అప్పట్లో రెవెన్యూ శాఖ ఉన్నతధికారులు ప్రకటించారు.

అడ్డగూడూరు మండలంలో గ్రామాల వారీగా..

అడ్డగూడూరు- 491, చిన్నపడిశాల- 133, చిర్రగూడూరు 39, చౌళ్లరామారం 112, ధర్మారం- 157, జానకీపురం-58, కంచనపల్లి -347, కోటమర్తి -277 డి.రాపాక - 45, గట్టుసింగారం-404, వెల్దేవి- 201 మొత్తం 2264 సాదాబైనామా దరఖాస్తులు వచ్చాయి.

30ఏళ్ల క్రితం భూమి కొనుగోలు చేశా



సాదాబైనామాతో 30సంవత్సరాల క్రితం ఎకరంన్నర భూమిని కొనుగోలు చేశాను. భూమి ఇప్పటి వరకు మాకు పట్టా కాలేదు. పట్టదారు పాసు పుస్తకం కోసం మూడన్నర ఏళ్ల కిత్రం మీ సేవ కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకున్నా ఇంత వరకు పట్టదారు పాసుపుస్తకం రాలేదు. దీంతో ప్రభుత్వం రైతులకు అమలు చేస్తున్న పథకాలను పొందలేకపోతున్నా.

-మందుల యాదయ్య, అడ్డగూడూరు మండలం

మార్గదర్శకాలు రావాల్సి ఉంది

ధరణిలో కొత్త పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. అయితే సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి ఇంకా ఖచ్చితమైన మార్గదర్శకాలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది.

-ఆమనగంటి శేషగిరిరావు, తహసీల్దార్, అడ్డగూడూరు

నిరుపయోగంగా జనరేటర్



భువనగిరి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న జనరేటర్

భువనగిరి రూరల్, జూలై 20: తహసీల్దార్ కార్యాలయంలో రైతులకు, ప్రజలకు నిరంతరంగా సేవలందించాలనే ఉద్దేశం, విద్యుత్ అంతరాయంతో ఆటంకం కలగ వద్దు అనే లక్ష్యంతో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన జనరేటర్ నిర్వహణ కరువై నిరుపయోగంగా మారింది. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తుప్పుపడుతోంది. చిన్నపాటి మరమ్మతులకు గురవడంతో ఇలా నిర్లక్ష్యంగా వదిలేశారని పలువురు ఆరోపిస్తున్నారు. భువనగిరి తహసీల్దార్ కార్యాలయంలో 10సంవత్సరాల కింద దాదాపు రూ.లక్ష వ్యయంతో జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. ఏడు సంవత్సరాల పాటు వాడకంలో ఉన్నా మూడేళ్ల నుంచి నిర్లక్ష్యంగా పక్కన పడేశారు. దీంతో ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ మరమ్మతులకు గురైంది. వర్షాకాలంలో విద్యుత్ కోతలు అధికంగా ఉంటున్న తరుణంలో అధికారులు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

బ్యాటరీ ఇన్వెర్టర్‌తో సేవలు



విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే కార్యాలయంలో ఏర్పాటు చేసుకున్న బ్యాటరీ ఇన్వెర్టర్‌తో ప్రత్యామ్నాయంగా సేవలందిస్తున్నాం. జనరేటర్ వినియోగంతో డీజిల్, తదితర మరమ్మతులతో నిర్వహణ భారం అధికంగా ఉంటోంది. అయినప్పటికీ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన సేవలు అందజేస్తున్నాం. కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జనరేటర్‌పై ప్లాస్టిక్ కవర్‌తో కప్పి భద్రపరుస్తాం.

-ఎన్.అంజిరెడ్డి, తహసీల్దార్, భువనగిరి

ముదిరాజ్‌ల డిమాండ్లను పరిష్కరించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సంఘం నాయకులు

భువనగిరి రూరల్, జూలై 20: ముదిరాజ్ కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ముదిరాజ్ కుల సంఘం నేతలు మాజీ మునిసిపల్ చైర్మన్లు పెంట నర్సింహ, ఎనబోయిన ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం భువనగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిరసన తెలిపి మాట్లాడారు. ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి, బీసీ-ఏ లోకి మార్చాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1000 కోట్ల నిధులు మంజూరు చేయాలని, చెరువులు, కుంటలపై ముదిరాజ్‌లకు, బెస్తలకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ చట్టం చేయాలని, మత్స్య కార్మికులకు వివిధ అభివృద్ధి పథకాలకు 75శాతం సబ్సిడీతో, మరో రూ.1000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ అంజిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఇట్టబోయిన గోపాల్, ఎనబోయిన జహంగీర్, ఉడుత భాస్కర్, ఎనబోయిన సత్యనారాయణ, కృష్ణ, పిట్టల బాలరాజ్, డొప్ప వెంకటేష్, తుమ్మల పాండు, పద్మ, మల్లిక, బిందు, ఇండ్ల వెంకటేష్, చిన్న నాగేష్, సాయి ఉన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

రామన్నపేట, జూలై 20: మండల కేంద్రంలోని మదర్ థెరిస్సా హైస్కూల్‌లో రోహిత్ చెవి, ముక్కు, గొంతు, కంటి హాస్పిటల్ నల్లగొండ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఈఎన్‌టీ వైద్య నిపుణుడు డాక్టర్ ఇమ్యానుయేల్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని విలేఖరులతో మాట్లాడుతూ ఈ శిబిరంలో ఉచిత కంటి, చెవి, ముక్కు, గొంతు, వినికిడి పరీక్షలు, ఎండోస్కోపిక్ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

చేపపిల్లలను పంపిణీ చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకార్మిక సంఘం నాయకులు

భువనగిరి అర్బన్, జూలై 20: మత్స్యకార్మికులకు ఉచితంగా చేపపిల్లలు పంపిణీ చేసి, కొత్తగా సహకార సంఘాలు ఏర్పరచాలని మత్స్య కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు చక్కా వెంకటేశ్ కోరారు. కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ హనుమంతు కే.జెండగేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులకు చేతివలలు, వాహనాలు ఇవ్వాలని, చెరువు పూడికతీత తీయాలన్నారు. కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.20లక్షల ఆర్థిక సాయంతో పాటు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలన్నారు. వినతి అందజేసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఈగల లింగం, అన్నెమైన వెంకటేశ్, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు బోలగాని సత్యనారాయణ, కళ్లె క్రిష్ణ, నాయకులు సింగర్తి శంకర్, పుల్లూరి పద్మ, తుమ్మల జ్యోతి, సోమేశ్వరీ, అంజయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సిబ్బంది భిక్షాటన



ఎంపీడీవో కార్యాలయంలో భిక్షాటన చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

ఆత్మకూరు(ఎం) జూలై 20: ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది శనివారం మండల కేంద్రంలో వ్యాపార దుకాణాల వద్ద బిక్షాటన చేశారు. ఈసందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు సుధాకర్, మహిళా కన్వీనర్ యాదమ్మ మాట్లాడుతూ సిబ్బందికి రావల్సిన పెండింగ్ వేతనాల బిల్లులు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, ఇన్సూరెన్స్, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ మండల గౌరవ అధ్యక్షుడు నోముల స్వామి, అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల కిష్టయ్య, జ్ఞానేశ్వర్, ఆర్.శ్రీను, రమేష్, లక్ష్మయ్య, యాదయ్య, నర్సింహాచారి, సైదులు, పద్మ, భారతమ్మ పాల్గొన్నారు.

పేదలకు పెన్నిధి కాంగ్రెస్ ప్రభుత్వం



బాధితురాలి కుటుంబానికి ఎల్‌వోసీ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, జూలై 20: పేదలకు పెన్నిధిగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, గ్రామీణ నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ కింద ఎల్‌వోసీ చెక్కులను అందించి వైద్యసాయం కల్పిస్తోందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పెద్దరావులపల్లి గ్రామానికి చెందిన పల్లా లక్ష్మీకి అత్యవసర చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.2లక్షల50వేల ఎల్‌వోసీ చెక్కును ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుందన్నారు. రైతులకు ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ అమలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పాలిట దైవంగా నిలిచారని అన్నారు. అన్ని వర్గాలకు చేయూతనిచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చిలుక బుచ్చయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు మోతె బాలు, స్థానిక నాయకులు వర్కాల బాలచందర్, చేగూరి ప్రభాకర్, కందాల కృష్ణ, జడల శివ, గుర్రాల గణేష్, ఏనుగు సుదర్శన్‌రెడ్డి, కొమ్ము భిక్షపతి పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలి

భువనగిరి రూరల్: గ్రామ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయించాలని భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గ్రామస్థులు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఐదు ఎకరాలకు బోరు బావుల్లో భూగర్భ జలాల పెంపునకు గ్రామ శివారులో గల చిన్నేరు వాగు వద్ద చెక్ డ్యాం నిర్మాణం, అసంపూర్తిగా నిలిచిపోయిన సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి గ్రామస్థులకు మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుక్క స్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రావి సురేష్‌రెడ్డి, గాదే కరుణాకర్, అశోక్, శేఖర్‌రెడ్డి, బాలు ఉన్నారు.

బలరాం మృతి అభ్యుదయ ఉద్యమాలకు లోటు



బలరాం భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

చౌటుప్పల్ టౌన్, జూలై 20: యూటీఎఫ్ ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు నల్లబెల్లి బలరాం అకస్మిక మృతి ప్రజాతంత్ర అభ్యుదయ ఉద్యమాలకు తీరని లోటని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. చౌటుప్పల్ పట్టణంలో మృతి చెందిన బలరాం మృతదేహంపై శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్సీ నర్సిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన బలరాం అంతిమ యాత్ర లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లాలో యూటీఎఫ్‌ను బలోపేతం చేయడంతో పాటు వేలాది మంది విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దిన ఘన త బలరాంకు దక్కిందని ఆయన అన్నారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, నాయకులు పి.కృష్ణమూర్తి, ఎం. రాజశేఖర్ రెడ్డి, దోనూరు బుచ్చి రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎం. దామోదర్, మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, కార్యదర్శి శ్రీరాములు, పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు మోటె సత్తయ్య పాల్గొన్నారు.

ప్రకృతి సంపదను పెంపొందించుకోవాలి



పటేల్‌గూడెంలో మొక్కను నాటుతున్న డీఆర్‌డీవో కృష్ణన్

ఆలేరు రూరల్, జూలై 20: ప్రకృతి సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని డీఆర్‌డీవో ఎంఏ.కృష్ణన్ అన్నారు. శనివారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంతో పాటు మండలంలోని పటేల్‌గూడెంలో గ్రామ పంచాయతీ నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలను నాటి సంరక్షించాలని కోరారు. ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, ఎంపీవో ఎండి.సలీం, టెక్నికల్ అసిస్టెంట్ రాంచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి మీన, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ ఉన్నారు.

చౌటుప్పల్ టౌన్ : పచ్చదనంతో మానవాళికి బహుళ ప్రయోజనాలు ఉన్నాయని చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాల కమ్ జూనియర్ కళాశాలలో శనివారం 75వ వనమహోత్సవాన్ని నిర్వహించారు. చైర్మన్ రాజు, కమిషనర్ వెంకటేశ్వరనాయక్ తదితరులు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజు మాట్లాడుతూ మొక్కలను విరివిగా నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని, మొక్కలను నాటడంతో పాటు సంరక్షించాలని అన్నారు. పచ్చదనంతో ప్రాణకోటికి స్వచ్ఛమైన ఆక్సీజన్ లభించడంతో పాటు వర్షపాతం పెరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె. సరోజనమ్మ, కౌన్సిలర్‌లు ఎండి. బాబాషరీఫ్, బి. మల్లేశం, కె. సైదులు, ఎస్ఎంసీ చైర్మన్ చింతల సాయిలు, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనా రెడ్డి, బోయ దేవేందర్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

రామన్నపేట: మండల కక్కిరేణి గ్రామంలో అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాంగగా ర్యాలీ నిర్వహించారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ చిల్ల ప్రేమలత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉపేందర్, అంగన్‌వాడీ టీచర్స్ ఉమాదేవి పాల్గొన్నారు.

మోత్కూరు : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న సేవలు వినియోగించుకోవాలని మోత్కూరు అంగన్‌వాడీ కేంద్రం-1 టీచర్ సునీత కోరారు. అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ-1 కేంద్రంలో ఆమె గర్భిణులకు సామూహిక సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో గర్భిణులు పాల్గొన్నారు.

వలిగొండ: మండలంలోని మునగాల తుర్కపల్లికి చెందిన మాసంపల్లి పరుశురాం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. 2003-2004 బ్యాచ్ క్లాస్‌మేట్స్ రూ.50వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులు అందజేశారు.

రామన్నపేట: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు గాదె శోభారాణి అన్నారు. మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులు ఆత్మగౌరవంతో బతకాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతులకు రుణమాఫీ అమలు చేసిందన్నారు.

మోత్కూరు : రైతు బీమా కోసం మోత్కూరు మండలంలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏవో కె.స్వప్న ఒక ప్రకటనలో తెలిపారు. రైతు బీమా పొందడానికి 18 నుంచి 59 ఏళ్ల లోపు వయస్సున్న రైతులు పట్టాదారు పాసు పుస్తకం, పట్టాదారు ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్‌లతో బీమా పత్రం నింపి ఆగస్టు 4లోపు సంబంధిత ఏఈవోలకు రైతు వేదికల్లో అందించాలన్నారు.

చౌటుప్పల్ టౌన్ : విద్యార్థుల పెండింగ్ స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.రాజు డిమాండ్ చేశారు. నిధుల విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23 న నిర్వహించే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమ కరపత్రాలను చౌటుప్పల్ పట్టణంలోని కళాశాలల్లో విడుదల చేశారు. కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తిగుళ్ల శ్రీనివాస్, వంశి, ప్రణయ్ పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. చౌరస్తాలో కేక్ కట్ చేసి ప్రజలకు మిఠాయిలను పంపిణీ చేశారు. నాయకులు బిక్షం, రాచకొండ రవి, వడ్డేపల్లి రాములు ,పాశం కృష్ణ, బోడ్డుపెల్లి గాలయ్య, చిలువేరు ముత్యాలు, ఏర్పుల అంజమ్మ, ఉప్పల శ్రీను, రాసాల వెంకటేష్ పాల్గొన్నారు.

అడ్డగూడూరు : మండలంలోని కోటమర్తి గ్రామానికి వంశీకృష్ణ ఆత్మహత్యకు కారణమైన నిందితున్ని వెంటనే అరెస్టు చేయాలని బాధితత కుటుంబ సభ్యులు డీసీపీకి వినతి పత్రం అందజేశారు. గ్రామస్థులు అందీప్ సైదులు, మందుల భిక్షం, మందుల బయ్యన్న వడ్డె యాదగిరి, బెల్లా గిరిబాబు ఉన్నారు.

చౌటుప్పల్ రూరల్ : ప్రభుత్వం రూ 2 లక్షల రుణమాఫీ చేసిన సందర్భంగా మండల పరిధిలోని ఆరెగూడెం, దామెరలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పునూతల నర్సింహ, జాల మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

మోత్కూరు : మండలంలోని పొడిచేడు గ్రామానికి చెందిన సత్తయ్యకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును ఎమ్మెల్యే మందుల సామేల్ ఆయనకు అందజేశారు.

భువనగిరి టౌన్: వర్షాకాలం ప్రారంభమైనందున మురికి కాల్వల శుభ్రతకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కమిషనర్ పి.రామాంజల్ రెడ్డి అన్నారు. స్థానిక 26వ వార్డులో పర్యటించారు. కౌన్సిలర్ ఈరపాక నర్సింహ, డీఈ కొండల్‌రావు, ఏఈ మూర్తి పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: ఆలేరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడె బూడిద భిక్షమయ్యగౌడ్ పుట్టినరోజు వేడుకలను ఆలేరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక సాయిబాబా ఆలయంలో భిక్షమయ్యగౌడ్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

దివ్యాంగుల ప్రయోజనాలను కాపాడతాం



ఎమ్మెల్యే వీరేశాన్ని సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

రామన్నపేట, జూలై 20: దివ్యాంగుల ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడుతుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం నకిరేకల్‌లో తనను కలిసిన వికలాంగుల జాతీయ వేదిక ప్రతి నిధులతో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, విద్యారంగంలో వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ అమలయ్యేలా తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు. ఈ నెల30న నిర్వహిస్తున్న వేదిక జిల్లా 3వ మహాసభకు హాజరు కావాలని వేదిక ప్రతినిధులు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు బల్గూరి అంజయ్య, పూస బాలనర్సింహ, ఎం.నరేష్ పాల్గొన్నారు.

బాక్స్ కల్వర్టు నిర్మాణం నాణ్యతగా పూర్తి చేయాలి



బాక్స్ కల్వర్టు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సామేలు

మోత్కూరు, జూలై 20: మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో ఎస్‌బీఐ సమీపాన వరద నీరు వెళ్లేందుకు మెయిన్ రోడ్డులో నిర్మిస్తున్న బాక్స్ కల్వర్టును నాణ్యతగా, వేగంగా పూర్తి చేయాలని తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్ అన్నారు. శనివారం బాక్స్ కల్వర్టు నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఈ కల్వర్టు నిర్మాణంతో వరద నీరు రోడ్డుపై ప్రవహించకుండా కల్వర్టు ద్వారా చెరువులోకి వెళుతుందన్నారు. నిర్మాణం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మునిసిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్, నాయకులు డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, అవిలిమల్లు, బయ్యని రాజు, మునిసిపల్ సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

ప్రభుత్వాలు మారినా పేదల బతుకులు మారలేదు



సభలో మాట్లాడుతున్న యూసీసీఆర్ఐ(ఎంఎల్) నాయకుడు సురేందర్

మోత్కూరు, జూలై 20: ప్రభుత్వాలు మారినా పేద ప్రజల బతుకులు బాగుపడటం లేదని యూసీసీఆర్ఐ (ఎంఎల్) నాయకుడు సురేందర్ విమర్శించారు. శనివారం రాత్రి మోత్కూరులో నిర్వహించిన భారత విప్లవోద్యమ నాయకులు దేవులపల్లి వెంకటేశ్వర్‌రావు, తరిమెల నాగిరెడ్డి సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. పేదల బతుకులు బాగుపడక పోగా మరింత దుర్భరమవుతున్నాయన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక, అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనికి తగిన కూలి, వేతనం లభించక కూలీలు, కార్మికులు, ఉద్యోగాలు లేక నిరుద్యోగులు రోడ్డున పడుతున్నారన్నారు. మోత్కూరు, అడ్డగూడూరు, ఆత్మకూరు(ఎం) మండలాలకు సాగునీరందించే బునాదిగాని కాల్వ 20 ఏళ్లైనా పూర్తి కావడం లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాలని ఆయన పిలుపునిచ్చారు. రుద్రవెల్లి నర్సింహ అధ్యక్షతన జరిగిన సభలో నాయకులు కొంగరి మల్లయ్య, వైల శ్రీనివాస్‌రెడ్డి, సత్తయ్య పాల్గొన్నారు.

శ్రమైక జీవనానికి ప్రతిబింబం బ్రహ్మాచారి



శాంతయ్యకు శ్రమశక్తి పురస్కారం అందజేస్తున్న డాక్టర్ లక్ష్మీనర్సింహారెడ్డి

మోత్కూరు, జూలై 20: సినీగేయ రచయిత అభినయ శ్రీనివాస్ తండ్రి బ్రహ్మాచారి శ్రమైక జీవనానికి ప్రతిబింబమని రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. పేద కుటుంబంలో జన్మించిన బ్రహ్మాచారి పెద్దగా చదువుకోకపోయినా స్వయంకృషితో నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో రైస్, ఆయిల్, ఫ్లోర్ మిల్లుల మెకానిక్‌గా పనిచేసి, అధునాతన పద్ధతులను అనుసరించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఆయన జ్ఞాపకార్థం అతని తనయుడు అభినయ శ్రీనివాస్ ఏటా ఇంజనీరింగ్ వర్క్సులో ప్రతిభ కనబర్చిన వారికి శ్రమశక్తి పురస్కారం ఇవ్వాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు. తొలి పురస్కారాన్ని శనివారం సాయంత్రం యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీనర్సింహారెడ్డి సూర్యాపేటకు చెందిన లక్ష్మీగణేష్ ఇంజనీరింగ్ వర్క్సు మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమాద శాంతయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజాభారతి అధ్యక్షుడు దేవినేని అరవిందరాయుడు, దొంతోజు సతీష్, గుంటి దేవా, సూరోజు భాస్కరాచారి, ఎస్ఎన్‌చారి, హెచ్ఎం టి.గోపాల్‌రెడ్డి, గుమిడెల్లి వెంకన్న, జానయ్య, వెంకటేశ్వర్లు, వెంకన్న, రాజు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ల నిర్వహణపై శ్రద్ధ చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు పాషా

చౌటుప్పల్ టౌన్, జూలై 20: చౌటుప్పల్ మునిసిపాలిటీలో దివీస్ సంస్థ ఏర్పాటు చేసిన వాటర్ పిల్టర్ ప్లాంట్ల నిర్వహణపై అధికారులు శ్రద్ధ చూపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండి. పాషా, పట్టణ కార్యదర్శి బండారు నర్సింహ అన్నారు. స్థానిక రంగారెడ్డి భవన్ లో శనివారం సీపీఎం పట్టణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ వాటర్ పిల్టర్ ఫాంట్లను అధికారులు సక్రమంగా నిర్వహించక పోవడంతో ప్రజలకు మంచినీరు అందడం లేదని , ఈ సమస్యను తక్షణమే పరిష్కరించి ప్రజలకు మంచినీటి సౌకర్యాన్ని కల్పించాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు ఆకుల ధర్మయ్య, బత్తుల దాసు, బొడ్డు అంజిరెడ్డి, ఎర్ర ఊషయ్య బొడ్డు రాజు, బి.దశరథ, మల్లేష్ పాల్గొన్నారు.